క్లుప్తంగా

సంపత్ గణపతికి శత సహస్ర రుద్రాక్ష పూజ



ప్రత్యేక అలంకరణలో సంపత్ గణపతి

బోట్‌క్లబ్: చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయం ఆవరణలో ఉన్న సంపత్ గణపతి ఆలయంలో స్వామి వారికి శుక్రవారం శత సహస్ర రుద్రాక్ష పూజ నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజ చేసి, రుద్రాక్ష మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ కనపర్తి నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త విడిగా సేకరించాలి



కొరుపల్లిలో నిల్వ ఉన్న నీటిని పారపోయిస్తున్న సిబ్బంది

కరప: గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించేటప్పుడు తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించాలని ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు సూచించారు. స్వచ్ఛ సేవలో భాగంగా శుక్రవారం ఆయన కరప, కొరుపల్లి, జెడ్.భావారం తదితర గ్రామాల్లో పర్యటించి గ్రామ కార్యదర్శులకు ఆయన పారిశుధ్య పనుల నిర్వహణపై పలు సూచనలిచ్చారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద సెకండ్ లెవెల్‌లో తడి, పొడి చెత్తను విడదీసి పంపడం, వర్మీ కంపోస్ట్ తయారీ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే అమలు చేయించారు.

విశ్వకవి అడవి బాపిరాజుకు నివాళులు

కాకినాడ రూరల్: తెలుగు విశ్వకవిగా కీర్తి పొందిన అడవి బాపిరాజు వర్ధంతిని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించి నివాళులు అర్పించారు. విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ బాపిరాజు నవలు, కథలు, కవిత్వం భావుకతకు పట్టం కట్టాయన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొని ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించిన బాపిరాజు 1958 సెప్టెంబరు 22న కాలం చేశారన్నారు.

జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడ

కాకినాడ రూరల్: ప్రకృతిలో జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని న్యాయవాది యనమల రామం పేర్కొన్నారు. అంతర్జాతీయ జీవావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతిలో మనిషితో పాటు వన్య ప్రాణులు, భూ, జల చరాలు, కీటకాలు, వృక్ష సంపద అన్నీ సమతుల్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కరప: మండల పరిధిలోని ఐదు గ్రామాల్లో ఎనిమిది గ్రామ వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. నడకుదురు, పాతర్లగడ్డ, వలసపాకల గ్రామాల్లో రెండేసి వంతున, గొడ్డటిపాలెం, గొర్రిపూడిలో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25న దరఖాస్తుల పరిశీలన, 26న ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 27న ఉత్తర్వులు ఇచ్చి, 29న శిక్షణ ఇస్తారని, 30న నియామక పత్రాలు అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం



శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ మాట్లాడుతూ రానున్న శరన్నవరాత్ర ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ చింతపల్లి విజయ భాస్కర్‌రెడ్డి, , ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డెంగీ ఫ్రీ నగరమే లక్ష్యంగా..

- దోమలపై ఎదురు దాడి
- గణనీయంగా తగ్గిన కేసులు
- ఫలితాలిస్తున్న అధికారుల కృషి



కుళాయి చెరువులో గంబూషియా చేపపిల్లలను విడుదల చేస్తున్న అధికారులు



రెసిడ్యువల్ స్ప్రే ద్వారా దోమల నివారణ చర్యలు

కాకినాడ క్రైం: నగరానికి ఒకప్పుడు పట్టిన పీడ డెంగీ. గణాంకాలు చూస్తే గగుర్పాటు కలిగించేవి. అవిభాజ్య జిల్లాలో నమోదైన డెంగీ కేసుల్లో కాకినాడ ప్రథమంగా ఉండేది. వైద్య ఆరోగ్య శాఖ నగర విభాగంతో పాటు మున్సిపల్ విభాగం పారిశుధ్య, ఆరోగ్య పర్యవేక్షణ విభాగాల కృషితో కేసులు గణనీయంగా తగ్గుతున్నాయి.

ఈ చర్యలతోనే...

ఫీవర్ సర్వే, లార్వా సర్వే, స్పేస్ స్ప్రే, యాంటీ లార్వా ఆపరేషన్లు డెంగీ నియంత్రణలో కీలకంగా మారాయి. కేసులు నమోదయ్యే ప్రాంతాలను జోన్లుగా గుర్తిస్తారు. ఆయా ప్రదేశాల్లో పారిశుధ్య అనుబంధ ప్రత్యేక రక్షణ చర్యలు చేపడతారు. 20 వేల గంబూషియా చేప పిల్లలను నీటి వనరుల్లో విడిచి పెట్టి లార్వా దశలోనే ప్రథమ నియంత్రణ చర్యలు తీసుకున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తూ ఏఎన్ఎంలు ఇచ్చిన సమాచారంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దోమల నియంత్రణలో కీలక పాత్ర వహించారు.

నగరంలో హాట్‌స్పాట్‌లు...

కాకినాడ నగరంలో గుడారిగుంట ప్రాంతంలో ఉన్న సీతారామ నగర్, పర్లోవపేట, జగన్నాథపురం పరిధిలోని ఏటిమొగ ప్రాంతాలు. సదరు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపడుతూ దోమల వ్యాప్తిని నియంత్రిస్తున్నారు. తద్వారా దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులకు అడ్డుకట్టపడుతోంది.

63 శాతం మేర తగ్గుదల

2022 ఏడాదిలో జనవరి నుంచి ఆగస్టు వరకు 48 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఆగస్టు వరకు వాటి సంఖ్య కేవలం 18కి పరిమితమైంది.

డెంగీ కేసులు లేకుండా తీర్చిదిద్దుతున్నాం



కాకినాడను డెంగీ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఆ దిశగా చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. నగరంలో ఉన్న 13 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో డెంగీ చికిత్స, కిట్లు అందుబాటులో ఉంచాం. ఈ చర్యలు బాధితులకు ప్రయోజనకరమయ్యాయి. నగర పరిధిలో యూపీహెచ్‌సీలలో 260 డెంగీ పరీక్షల కిట్లు అందుబాటులో ఉన్నాయి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. 100 సచివాలయాల పరిధిలో ప్రతి వారం వెక్టార్ హైజీన్ యాప్ ద్వారా పారిశుధ్య పర్యవేక్షణ కొనసాగుతోంది.

– డాక్టర్ పృథ్వీ చరణ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

పగటి వేళ కుట్టే దోమ వల్లే..



పగటి వేళ కుట్టే ఈడిస్ దోమ వల్ల డెంగీ సోకుతుంది. మంచినీటి నిల్వల్లోనే ఈ దోమ పెరుగుతుంది. వైద్య, ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖల పరస్పర సమన్వయంతో డెంగీ కేసుల నియంత్రణ సాధ్యమైంది. శాఖ నుంచి మున్సిపల్ విభాగానికి 10 మంది ఎంపీహెచ్ఈవో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 63 శాతం మేర కేసులు తగ్గాయి.

– ఎస్.భాస్కరరావు, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి

జీ-20 సదస్సుపై విద్యార్థులకు అవగాహన



జీ-20 సదస్సుపై వివరిస్తున్న కళాశాల అకడమిక్ డైరెక్టర్ నాయుడు

బాలాజీచెరువు: ఆదిత్య డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జీ-20 సదస్సుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు హాజరై విద్యార్థులకు వర్తమాన విషయాలపై అవగాహన ఉండాలని, ఈ సదస్సు ద్వారా తీసుకున్న నిర్ణయాలు వివరించాలనే ఉద్దేశంతో అవగాహన ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పోటీపరీక్షల సమయంలో ఇటువంటి సదస్సులు బాగా ఉపయోగపడతాయన్నారు. ఎంఎస్ఎన్ పీజీ కళాశాల పాలిటిక్స్ అధ్యాపకులు డాక్టర్ జోసఫ్ స్టీఫెన్ సదస్సు వల్ల కలిగే ప్రయోజనాలు, దేశాల మధ్య సమైక్యతా భావం కలగడానికి దోహదపడే అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌చార్జి మూర్తి, డాక్టర్ ఆలీ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ కృతికా శుక్లా
- నార్కో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రధానంగా విద్యాసంస్థల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నార్కో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకు విద్యా సంస్థల్లో ప్రత్యేకంగా నోడల్ అధికారులను, కమిటీలను నియమించాలని ఆదేశించారు. ఉత్పత్తి, రవాణా, వినియోగం, ఈ మూడు దశలపై సమన్వయ శాఖల అధికారులు పటిష్ట నిఘా పెట్టి జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. రైల్వే స్టేషన్లలో సీసీటీవీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మెడికల్ దుకాణాలను తరచు తనిఖీలు చేయాలని, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. జీజీహెచ్‌లో ప్రత్యేకంగా డీఅడిక్షన్, రీహ్యాబిలిటేషన్ కేంద్రం పని చేస్తోందన్నారు. ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా కాకినాడను మార్చేందుకు పోలీస్‌శాఖ చేస్తున్న కృషి మంచి ఫలితాలు ఇచ్చినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు, తదితర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. సెబ్ టోల్‌ఫ్రీ నంబరు 14500 అందుబాటులో ఉన్నట్లు ఆయన వివరించారు. ముందుగా సెబ్ అడిషనల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్ జిల్లాలో నమోదైన గంజాయి, గంజాయి అక్రమ రవాణపై నిఘా తదితరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది మే 15వ తేదీ నుంచి ఈ నెల 20వతేదీ వరకు 11 గంజాయి కేసుల్లో 88 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 16 యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిఘాను పటిష్టం చేసి, విస్తృత స్థాయిలో ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నామని ప్రేమ్‌కాజల్ వెల్లడించారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో ఎస్ భరణి, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఎల్.సుమలత, కాకినాడ, పెద్దాపురం డీఎస్పీలు కె.మురళీ కృష్ణారెడ్డి, కె.లతాకుమారి, ఉప రవాణా కమిషనర్ ఎ.మోహన్, డీఈవో నాగమణి, మెప్మా పీడీ బి.ప్రియంవదలతో పాటు రెవెన్యూ, పోలీస్, వ్యవసాయం, ఔషధ, విద్య, వైద్యం, ఆరోగ్యం, అటవీ, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించండి

కాకినాడ సిటీ: జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆమె అధ్యక్షతన కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో బ్లాక్ స్పాట్‌లు, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. గత సమావేశంలో తీర్మానించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలను రోడ్డు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె హరిప్రసాద్‌బాబు వివరించారు. ప్రధానంగా ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్ 216లపై ప్రమాదాలు జరక్కుండా తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై జాతీయ రహదారులు, పోలీస్, ట్రాఫిక్, నగరపాలక సంస్థ, విద్యుత్, వైద్య, ఆరోగ్య తదితర అధికారులకు సూచనలిచ్చారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఈ ఏడాది గణాంకాల ప్రకారం గత 8 నెలల్లో సుమారు 476 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, జిల్లాలో నెలకు సగటున 27 మరణాలు సంభవిస్తున్నట్లు వెల్లడించారు. రహదారుల వెంబడి ఆక్రమణలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నందున వాటిని తొలగింపుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వరకు చేపట్టిన ఏడీబీ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాలు గతంతో పోలిస్తే కొంత వరకు తగ్గాయన్నారు. వీటిని భవిష్యత్తులో గణనీయంగా తగ్గించేందుకు తీసుకున్న చర్యలను వివరించారు. రవాణాశాఖ ఉప కమిషనర్ ఎ.మోహన్, ఏపీఈపీ డీసీఎల్ ఈఈ ప్రసాద్, డీఎస్పీలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గణేశ నిమజ్జనాలకు విస్తృత ఏర్పాట్లు

- ఆర్డీఓ సత్యనారాయణ
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



గణేష్ నిమజ్జనంపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించే గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై డివిజన్ స్థాయి సమన్వయ సమావేశం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్డీఓ ఎస్‌వీ సత్యనారాయణ అధ్యక్షతన సమావేం జరిగింది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వార్ఫ్‌రోడ్డు బ్రహ్మంగారి మఠం వద్ద కమర్షియల్ రోడ్డు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, జవహర్ జెట్టీ వద్ద నిమజ్జనాలకు ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. అదే విధంగా కాకినాడ రూరల్ మండలంలో సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్, యు కొత్తపల్లి మండలం సుబ్బంపేట బీచ్ ప్రాంతాలను గణేష్ నిమజ్జనానికి గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సన్నాహాక ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిమజ్జనానికి అవసరమైన తాగునీరు, విద్యుత్, భారీ క్రేన్లు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆర్డీవో ఆదేశించారు. అలాగే ఆధ్యాత్మిక వాతావరణంలో నిమజ్జనాలు జరిగేలా ఉత్సవ కమిటీ సహకరించాలని కోరారు. డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి, అగ్నిమాపక అధికారి సుబ్బారావు, మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ నూకరాజు, తహసీల్దార్లు మురార్జీ, సీతాపతిరావు, ఏవో వరహాలయ్య, ట్రాఫిక్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

25న వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 25వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఇండస్ ఇండ్ బ్యాంక్‌లో లోన్ ఆఫీసర్, బజాజ్ కాపిటల్‌లో ఫైనాన్షియల్ అడ్వయిజర్, అపర్ణ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్‌లో ట్రైనీ ల్యాబ్ టెక్నిషియన్, నిట్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్, సోలారా యాక్టివ్ ఫార్మా సైన్సెస్ కంపెనీలో ప్రొడక్షన్ టెక్నీషియన్, అపోలో టైర్స్, డిక్సాన్ అండ్ హుందాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు లచ్చారావు తెలిపారు. అలాగే డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించనున్నారన్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, ఆర్కిటెక్చర్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఉత్తీర్ణులైన 25 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు వికాస కార్యాలయంలో సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని పీడీ వివరించారు.

జగనన్న పాలవెల్లువ అమలుకు చర్యలు



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: మండలంలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ కార్యదర్శులు, సచివాలయ అసిస్టెంట్లు, వ్యవసాయ తదితర శాఖల సిబ్బందితో ఆయన సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. పాలసేకరణకు 14 గ్రామాలను గుర్తించామని, అక్కడ కమిటీలన ఏర్పాటు చేసి బ్యాంకు అకౌంట్లు తీసుకుని పాల సేకరణకు అనువుగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 29న జిల్లాలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ పర్యటన విజయవంతం చేసేందుకు వాహనమిత్ర లబ్ధిదారులు సభకు వచ్చేలా చైతన్యపరచాలన్నారు. ఖరీఫ్‌లో 4.28 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యంసేకరించాలన్న లక్ష్యానికి అనుగుణంగా రవాణాకు వీలుగా వాహనాలను గుర్తించి, జాబితా సిద్ధం చేయాలని ఎంపీడీఓ అప్పారావు సూచనలు చేశారు. స్వామిత్ర, ఇంటిపన్నులు వసూలు, స్వచ్ఛత హి సేవ నిర్వహణ తదితర అంశాలపై చర్చించి, ఎంపీడీఓ సూచనలిచ్చారు. ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏపీఎం ఎంఎస్‌బీ దేవి, ఏపీఓ ఇ.వెంకటరమణ, ఎంఏఓ ఏవీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన మూర్తి రాజు



కలెక్టర్ కృతికా శుక్లాతో మూర్తి రాజు బృందం

కాకినాడ సిటీ: కాకినాడ క్రిస్టియన్ యూత్ ఫెలోషిప్ (సీవైఎఫ్) డైరెక్టర్ మూర్తి రాజు బృందం శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 14న లండన్ పార్లమెంట్‌లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అవార్డు స్వీకరించడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనే ఈ గౌరవాన్ని పొందడం ఇది తొలిసారి కావడంపై ఆయనను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. గత 25 ఏళ్లుగా యువతను సన్మార్గంలో ఆధ్యాత్మికంగా నడిపించినందుకు ఈ అవార్డు అందుకున్నట్టు మూర్తి రాజు తెలిపారు. ఇదే స్ఫూర్తితో యువతకు మంచి జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ఆయనకు సూచించారు. జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు రెవరెండ్ జాషువా గిరి, సీవైఎఫ్ బోర్డు సభ్యులు రెవరెండ్ కె సునీల్, పి.నానిబాబు, ఎం.బుజ్జిబాబు, పి.బాలు తదితరులు ఉన్నారు.

అలరించిన గాత్ర కచేరీ

కాకినాడ కల్చరల్: స్థానిక శ్రీరామ సమాజం 129వ గణపతి సంగీత హరికథా మహోత్సవాలలో భాగంగా ఐదో రోజు సూర్యకళా మందిరంలో హైదరాబాద్‌కు చెందిన ఐ.శ్వేతప్రసాద్ గాత్ర కచేరీ ప్రేక్షకుల హృదయాలను ఓలలాడించింది. వీరు నాట రాగంలో నిన్నే భజన ఖరహరప్రియ రాగంలో ప్రక్కాన నిలాబడి, వలజి రాగంలో జాలంధర తదితర కీర్తనలు రసవత్తరంగా పాడి ప్రేక్షకుల మన్ననలు పొందారు. వీరికి వయోలిన్‌పై కోలంక సాయికుమార్, ఐ.రేణుక ప్రసాద్, ఘటంపై శ్రీ రామకృష్ణ చక్కటి సహకారాన్ని అందించారు. ప్రతివాద భయంకర యతీంద్ర వేంకట రఘునాథాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేయగా పి.అనంత్, సుధా మాడభూషి, ఎం.కల్యాణి, మునుగంటి వెంకట్రావు, డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు హర్షణీయం

కరప: మహిళా రిజర్వేషన్ బిల్లు దేశచరిత్రలో నిలిచిపోతుందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుట్టా వీర ప్రసాద్‌గాంధీ పేర్కొన్నారు. కరపలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా రాజకీయ సంస్కరణలు చేయడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, ముమ్మిడి పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

తూరంగి పీహెచ్‌సీ తనిఖీ



ప్రసవాల వార్డును సందర్శించి బాలింత నుంచి వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ రత్నకుమార్

కాకినాడ సిటీ: జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కె.రత్నకుమార్ శుక్రవారం తూరంగి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలతో పాటు ప్రసవాలు, లేబర్ రూము, ఫార్మసీ నిర్వహణ తదితర వివరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను బాలింతలను అడిగి తెలుసుకున్నారు. మందులు, ఆసుపత్రిలో ఇతర సదుపాయాలపై డాక్టర్ ప్రశాంతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇంద్రపాలెం-2 సచివాలయంలోని ఫీల్డ్ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ వసుంధరాదేవి, ఎంపీహెచ్ఈవో పీవీ ప్రకాశరావు, పీహెచ్ఎన్ సుభాషిణి, సూపర్‌వైజర్ ఇబ్రహీం, మరియమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడలు

సామర్లకోట: జూనియర్, సీనియర్ విభాగాలల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం నియోజకవర్గ క్రీడా పోటీలు ముగిసాయి. పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో నియోజకవర్గం నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు ఎంపిక కమిటీ కన్వీనర్ యార్లగడ్డ బంగార్రాజు తెలిపారు. శుక్రవారం అండర్ 14, 17 విభాగంలో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు 332 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు బంగార్రాజు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యా యులు వరుస దానం, ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వర్లు, విశ్వేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ఇబ్రహీం, వీరబాబు, శ్రీనివాసు, సునయన, జయలక్ష్మీ, అరుణ, రవి, లక్ష్మీ, శేఖర్‌లు పోటీలను నిర్వహించారు. ఎంఈఓలు శర్మ, రామకృష్ణ చౌదరి, వై శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్యలు పాల్గొన్నారు.

జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

సామర్లకోట: స్కూల్ గేమ్స్‌లో భాగంగా స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం మీనామాధురి, పీడీ జి.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం పెద్దాపురం మహారాణి కళాశాలలో జరిగిన పెద్దాపురం నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ అండర్ 17 విభాగంలో మాధురి, రిచ్కా, ఐశ్వర్య, అండర్-14 విభాగంలో అరుణశ్రీ, శ్రీవల్లి, లాస్య, యోగా అండర్-17 విభాగంలో అనిత, అఖిల, అండర్-14 విభాగంలో కుసుమ, త్రోబాల్ అండర్-17లో శారద, అండర్-14లో ప్రియాంక ఎంపికైనట్టు హెచ్ఎం వివరించారు.